క్లుప్తంగా

ఆక్సిజన్ పరికరాల వితరణ



ఆక్సిజన్ పరికరాన్ని అందజేస్తున్న వడ్ల మోపూరు సొసైటీ సీఈఓ కరుణాకర్‌రెడ్డి

దక్కిలి: మండలంలోని వడ్ల మోపూరు ఆరోగ్య ఉపకేంద్రానికి ఆక్సిజన్ పరికరాలు వెంకటగిరి పట్టణానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు దొంతు గోపీ సొంత నిధులతో ఏర్పాటు చేసిన ఆక్సిజన్ పరికరాలను గురువారం వడ్ల మోపూరు సొసైటీ సీఈఓ బండి కరుణాకర్‌రెడ్డికి అందజేశారు. ఈసందర్భంగా కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ మోపూరు ఆరోగ్య ఉపకేంద్రం పరిధిలోని చుట్టుపక్కల గ్రామాల నుంచి ఆస్పత్రికి వచ్చే పేద ప్రజలకు ఎంతో ఉపయోగపడే విధంగా ఆక్సిజన్ పరికరాలను దాత గోపి అందజేయడం అభినందనీయమన్నారు. అనంతరం హుమిడిఫైర్ (తేమ అందించు పరికరం)ను ఎంఎల్‌హెచ్‌పీ అధికారి యశశ్వినికి అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటకృష్ణారెడ్డి, శ్రీనివాసులురెడ్డి ఉన్నారు.

5న కోనలో పుష్పయాగం

రాపూరు: జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో స్వయంభుగా వెలసిన శ్రీపెనుశిల లక్ష్మీనరసింహస్వామికి (ఆదివారం) 5వ తేదీన మాఘపౌర్ణమి సందర్భంగా పుష్పయాగం నిర్వహించనున్నట్లు దేవస్థాన అధికారులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 4వ తేదీ రాత్రి పుష్పయాగానికి అంకురార్పణ, ఆదివారం పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీ దేవి, చెంచులక్ష్మీ దేవి ఉత్సవ విగ్రహాలకు ఉదయం స్నపన తిరుమంజనం, రాత్రికి వివిధ రకాల పుష్పాలతో అలంకరిస్తామన్నారు.

సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు మృతి



వెంకటసుబ్బానాయుడు

దక్కిలి: మండలంలోని వెంబులూరు పంచాయతీ కమ్మపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు మాధవయ్యపాళెం సొసైటీ మాజీ అధ్యక్షుడు సంక్రాంతి వెంకటసుబ్బానాయుడు (75) గురువారం ఉదయం గుండెపోటుతో మృతి చెందాడు. వెంకటగిరి పట్టణంలోని నివాసంలో ఆయనకు ఉదయం ఛాతిలో నొప్పి రావడంతో ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. కుటుంబ సభ్యులు ఆయనను వెంటనే పట్టణంలోని ఓ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆయన స్వగ్రామం కమ్మపల్లిలో అంత్యక్రియలు జరిగాయి. వెంకటగిరి, డక్కిలి మండలాల వైఎస్సార్‌సీపీ నాయకులు ఆయనకు నివాళులు అర్పించారు.

ప్రమాదరహిత ఆర్టీసీకి కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంవీఐ జాకీర్

గూడూరు: డ్రైవర్లు అప్రమత్తంగా ఉంటూ ప్రమాద రహిత ఆర్టీసీకి కృషి చేయాలని సీనియర్ ఎంవీఐ జాకీర్ పిలుపునిచ్చారు. స్థానిక ఆర్టీసీ డిపోలో జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల ముగింపు సందర్భంగా గురువారం రక్తదానం శిబిరం ఏర్పాటు చేశారు. అలాగే ఉత్తమ సేవలందించిన సిబ్బందిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డీఎం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం ఎంతో సురక్షితమైందని, ఈ క్రమంలోనే ఆర్టీసీ బస్సు డ్రైవర్లు ఎంతో అప్రమత్తతతో వ్యవహరించాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో ఏరియా ఆస్పత్రి వైద్యులు సందీప్, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

మెరుగైన వసతులు కల్పిస్తాం

కోట: కోట బస్టాండ్ నుంచి ప్రయాణించే ప్రయాణికులకు మెరుగైన వసతులు కల్పిస్తామని తిరుపతికి ఆర్టీసీ డిప్యూటీ ఇంజినీర్ చెన్నకేశవరావు తెలిపారు. మండల కేంద్రమైన కోటలో ఉన్న ఆర్టీసీ బస్టాండ్‌ను ఆయన గురువారం తనిఖీ చేశారు. ప్రయాణికులకు అవసరమైన అన్ని వసతులు కల్పించేలా చూస్తున్నామని అన్నారు.

గంజాయి సరఫరాపై ముమ్మర తనిఖీలు



హోలీక్రాస్ కూడలిలో బస్సులో ప్రయాణికుల బ్యాగులను తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

సూళ్లూరుపేట రూరల్ : ఉమ్మడి జిల్లా నెల్లూరు వైపు నుంచి చెన్నైకు గంజాయి సరఫరా చేస్తున్నారనే అనుమానంతో సూళ్లూరుపేట స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు గురువారం జాతీయ రహదారిపై వాహనాలను ముమ్మర తనిఖీలు చేపట్టారు. పట్టణంలో ఉన్న హోలీ క్రాస్ ప్రాంతం నుంచి టోల్‌ప్లాజా వరకు అధికారులు విడతల వారీగా ఆర్టీసీ, ప్రైవేటు బస్సులు, పలు ప్రైవేట్ వాహనాలతో పాటు ప్రయాణికుల బ్యాగులను తనిఖీ చేశారు. అడిషనల్ ఎస్పీ రాజేంద్ర ఆదేశాల మేరకు బృందాలుగా ఏర్పడి వాహనాలను తనిఖీ చేస్తునట్లు ఎక్సైజ్ సీఐ సూర్యనారాయణ తెలిపారు. దాడుల్లో ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనకు ప్రభుత్వం కృషి

- మా ప్రభుత్వంలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు
- ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య
- ఇంటి బిల్లు ఇప్పించాలని టీడీపీ మాజీ సర్పంచ్ వినతి



టీడీపీ మాజీ సర్పంచ్ రమణమ్మకు ప్రభుత్వం నుంచి అందిన సంక్షేమ ఫలాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

దొరవారిసత్రం: రాష్ట్రంలో పేదరిక నిర్మూలనకు ప్రభుత్వం కృషి చేస్తోందని, అది సీఎం జగనన్నతోనే సాధ్యం అవుతుందని స్థానిక ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. గురువారం కొత్తపల్లి సచివాలయ పరిధిలోని కొత్తపల్లి గ్రామం, ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో కలుజుమిట్ట ఎస్టీ కాలనీలో ఎమ్మెల్యే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన ప్రతి ఇంటికీ వెళ్లి జగనన్న అధికారంలో వచ్చిన తరువాత అందించిన పథకాలు, సంక్షేమ ఫలాల గురించి ప్రజలకు వివరించి బుక్‌లెట్ అందజేశారు. దీంతో పాటు ఆయన దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరించాలని, ఆయా శాఖ అధికారులను ఆదేశించారు.

నాడు–నేడుతో మౌలిక వసతులు..

అనంతరం ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం, రైతులు, డ్వాక్రా మహిళల అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు తీసుకువచ్చారని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకే దేశంలో ఎక్కడా లేని విధంగా మన బడి నాడు–నేడు పథకం కింద విడతల వారీగా పాఠశాలల్లో మౌలిక వసతులతో పాటు అదనపు భవన నిర్మాణాలు చేపట్టారని చెప్పారు. అంతేగాకుండా ప్రతి విద్యార్థికీ అమ్మఒడి అందించి తల్లులకు భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో గతంలో ఎన్నడూ లేనివిధంగా కులమతాలకు అతీతంగా పార్టీలతో పని లేకుండా అర్హతే ప్రామాణికంగా ప్రతి సంక్షేమ పథకాలు అందించిన ఘనత మన సీఎం జగనన్నకే దక్కుతుందన్నారు. ఎక్కడికక్కడే ప్రతి ఒక్కరికీ సేవలందించాలనే తపనతో మన సీఎం సచివాలయ వ్యవస్థ, ఆర్బీకే, హెల్త్ వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటు చేశారని చెప్పారు. ఇవి దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. ఆయన వెంట సూళ్లూరుపేట చెంగాళ్లమ్మ ట్రస్ట్ బోర్డు చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, కన్వీనర్ ఈశ్వరవాక శ్రీనివాసులు రెడ్డి, నాయకులు రామచంద్రనాయుడు, ప్రసాద్‌నాయుడు, మురళినాయుడు, మనోజ్, మునస్వామినాయుడు, ప్రసాద్‌నాయుడు, సురేష్‌రెడ్డి, మణి, రాజగోపాల్, అంకయ్య, ఎంపీడీఓ సింగయ్య, తహసీల్దార్ గోపినాథ్‌రెడ్డి, పలు శాఖల అధికారులు, కార్యకర్తలు ఉన్నారు.

ఎమ్మెల్యేకి టీడీపీ మాజీ సర్పంచ్ మొర

కొత్తపల్లి ఎస్సీ కాలనీలో గడప గడపకు కార్యక్రమం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కిలివేటికి కొత్తపల్లి పంచాయతీ మాజీ సర్పంచ్ గడ్డం రమణమ్మ గత టీడీపీ హయాంలో పక్కాగృహం కట్టుకున్నామే కానీ బిల్లు రాలేదని మొరపెట్టుకుంది. దీనిపై ఎమ్మెల్యే మాట్లాడుతూ గత టీడీపీ హయాంలో ఇల్లు ఇచ్చినట్లు కాగితాలపై చూపి లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో కేవలం రూపాయి వేసి చేతులు దులుపుకున్న విషయం తెలిసిందేనన్నారు. ఆమెకు ఇంటి బిల్లు అందేలా చూడాలని సంబంధిత హౌసింగ్ అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. అనంతరం ఆయన జగనన్న ప్రభుత్వంలో మీ కుటుంబానికి అమ్మఒడి రెండు దఫాలు, వైఎస్సార్ సున్నా వడ్డీ, రైతు భరోసా, వైఎస్సార్ ఆసరా మొత్తం రూ.83,459 లబ్ధి చేకూరిందని మాజీ సర్పంచ్ రమణమ్మకు వివరించి బుక్‌లెట్‌ను అందజేశారు.

ఇళ్ల నిర్మాణంలో జాప్యం వద్దు

నాయుడుపేటటౌన్: జగనన్న కాలనీలో ఇంటి స్థలం పట్టాలు పొందిన ప్రతి ఒక్కరూ త్వరగా ఇంటి నిర్మాణాలు చేసుకోవాలని, ఆ విషయంలో జాప్యం చేయవద్దని కమిషనర్ శ్రీనివాసరావు తెలిపారు. పట్టణంలోని గరిఢీ సచివాలయల పరిధిలో ఇంటి పట్టాలు మంజూరై ఇంతవరకు ఇంటి నిర్మాణాలు చేపట్టని వారితో గురువారం సాయంత్రం ఆయన సమావేశమై అవగాహన కల్పించారు. మున్సిపాలిటీ పరిధిలో జగనన్న కాలనీల్లో సగానికి పైగా ఇంటి నిర్మాణాలు జరుగుతున్నాయని తెలిపారు. సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆదేశాలతో గృహ నిర్మాణ శాఖ అధికారులతో పాటు సచివాలయ ఉద్యోగులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నారని, ముఖ్యంగా ఆర్థిక ఇబ్బందులు ఉన్న వారికి పొదుపు సంఘం ద్వారా రుణాలను అందించేందుకు మెప్మా అధికారులు, ఆర్పీలు చర్యలు చేపట్టినట్లు చెప్పారు. ఇంటి నిర్మాణలు చేసుకునే వారికి ఇసుక, సిమెంట్, కమ్మీ తదితర వాటిని సత్వరం అందిస్తూ అధికారులు అన్ని విధాలుగా సహకారం అందిస్తున్నారని తెలిపారు. ఇంతవరకు ఇంటి నిర్మాణాలు మొదలుపెట్టని వారు తక్షణం పనులు ప్రారంభించాలని కమిషనర్ సూచించారు. కార్యక్రమంలో అడ్మిన్ అలక్తర్, వెల్ఫేర్ అసిస్టెంట్ బల్లి సురేంద్ర, వివిధ విభాగాల కార్యదర్శులు, వలంటీర్లు తదితరులు ఉన్నారు.

ఇంటి నిర్మాణాలు పూర్తి చేయండి

పెళ్లకూరు: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను సకాలంలో పూర్తి చేసేలా చర్యలు చేపట్టామని ఎంపీడీఓ సురేష్‌బాబు అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన జగనన్న లేఅవుట్లకు సంబంధించి లబ్ధిదారులు గృహ నిర్మాణ పనులు చేపట్టేలా రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేస్తున్నట్లు చెప్పారు. అందువల్ల లబ్ధిదారులు ఇంటి పనులు చేసుకోవాలని సూచించారు. ఇళ్ల నిర్మాణాలకు సంబంధించిన బిల్లులు సకాలంలో లబ్ధిదారుల ఖాతాలో జమ అయ్యేలా చర్యలు తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ శ్రీనివాసులు, ఏఈ ప్రసాద్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

4న ప్రజావేదిక

పెళ్లకూరు: మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద మండలంలోని 24 పంచాయతీల్లో 2020 ఏప్రిల్ 1 నుంచి 2022 మార్చి31 వరకు చేపట్టిన పనులు, పంచాయతీరాజ్ వైఎస్సార్ క్రాంతిపథం, హౌసింగ్ శాఖలకు సంబంధించి ఈనెల 4న మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు గురువారం ఎంపీడీఓ సురేష్‌బాబు తెలిపారు. గత పది రోజులుగా సామాజిక తనిఖీ బృందాలు గ్రామాల్లో తనిఖీలు చేపట్టాయన్నారు. సేకరించిన తుది నివేదికను ప్రజావేదికలో బహిరంగంగా సమర్పించేందుకు అన్ని చర్యలు చేపట్టామని తెలిపారు. ఈ ప్రజావేదికకు ఆయా గ్రామాల ఉపాధి కూలీలు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

నేడు కో–ఆప్షన్ సభ్యుడి ఎంపికపై సమావేశం

చిల్లకూరు: మండల పరిషత్ కో–ఆప్షన్ సభ్యున్ని ఎంపిక చేసేందుకు శుక్రవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీఓ విష్ణుచిరంజీవి తెలిపారు. గురువారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ మాట్లాడుతూ గతంలో ఎంపికైన కో–ఆప్షన్ సభ్యుడు అకాల మరణం చెందడంతో కొత్త సభ్యున్ని ఎంపిక చేసేందుకు జిల్లా కలెక్టర్ ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారన్నారు. అందుకోసం శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నామని, మండలంలోని ప్రజా ప్రతినిధులు, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

పొలాల్లోకి దూసుకెళ్లిన కారు



క్రేన్ సాయంతో కారును బయటకు తీస్తున్న దృశ్యం

చిల్లకూరు: జాతీయ రహదారిపై వెళ్తున్న కారును ఓ టిప్పర్ ఢీకొనడంతో కారు పొలాల్లోకి దూసుకెళ్లింది. త్రుటిలో ప్రమాదం తప్పడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. స్థానికుల వివరాల మేరకు.. సూళ్లూరుపేటకు చెందిన బాబాయ్య శ్రీహరి కోటలోని షార్‌లో పని చేస్తూ పదవీ విరమణ చేశారు. ఆయన తన సతీమణితో కలిసి కారులో నెల్లూరుకు వెళ్లి తిరిగి ఇంటికి వెళ్తుండగా కారు చిల్లకూరు సమీపంలో జాతీయ రహదారిపై ముందు వెళ్తున్న టిప్పర్‌ను అధిగమించే ప్రయత్నం చేశారు. అమితే టిప్పర్ డ్రైవర్ ఎడమ వైపునకు రావడంతో కారును ఢీకొంది. దీంతో కారు అదుపు తప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. అటుగా వెళ్లే వారు గమనించి హైవే సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకుని క్రేన్ సాయంతో కారును బయటకు తీశారు. ఈ విషయమై పోలీసులకు ఎలాంటి సమాచారం అందలేదన్నారు.

మెరుగైన బోధన అందించాలి

డక్కిలి: విద్యార్థులకు మెరుగైన బోధనను ఉపాధ్యాయులు అందించి తీర్చిదిద్దాలని ఎంఈఓ వెంకటేశ్వర్లు తెలిపారు. మండలంలోని మోపూరు ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాలను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు అర్థమయ్యేరీతిలో సులభతరంగా బోధన అందించాలని సూచించారు. పాఠశాలలో విద్యార్థుల హాజరు, పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన విద్యార్థులకు పలు అంశాలపై బోధన చేసి, సామర్థ్యాలను రాబట్టారు. అదేవిధంగా జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం రుచికరంగా ఉండాలని, నాణ్యత పాటించాలని సూచించారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

కలువాయి: మండలంలోని తెలుగురాయపురం సమీపంలో పెన్నానది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను సెబ్ అధికారులు గురువారం దాడి చేసి పట్టుకున్నారు. అనంతరం కలువాయి పోలీసులకు స్వాధీనం చేయడంతో వారు కేసు నమోదు చేశారు. మండలంలో అధికారిక ఇసుక ర్యాంపులు లేకపోవడంతో బద్దెవోలు, తెలుగురాయపురం, నూకనపల్లి ప్రాంతాల నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఓవైపు అధికారులు దాడులు చేస్తున్నా ఇసుక అక్రమ తరలింపు సాగుతూనే ఉంది.

పరమేశ్వరి అమ్మవారి సేవలో హైకోర్టు జడ్జి



చెంగాలమ్మను దర్శించుకున్న హైకోర్టు జడ్జి రమేష్ దంపతులు

సూళ్లూరుపేట : సూళ్లూరుపేట పట్టణంలో వెలసిన చెంగాలమ్మ పరమేశ్వరి అమ్మవారిని ఏపీ హైకోర్టు జడ్జి రమేష్ దంపతులు దర్శించుకున్నారు. గురువారం ఆలయానికి విచ్చేసిన వారికి ఆలయ ఈఓ ఆళ్ల శ్రీనివాసులురెడ్డి ఘన స్వాగతం పలికారు. అనంతరం జడ్జి దంపతులు అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వారిని ఆలయ మర్యాదలతో ఘనంగా సత్కరించి వేదపండితుల ఆశీర్వచనం, తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు చంద్రశేఖర్‌రెడ్డి, సూళ్లూరుపేట జడ్జిలు ఫైజున్నీసా, అనిల్‌కుమార్, తహసీల్దార్ రవికుమార్, న్యాయవాది పార్థసారథి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తక్కువ ప్రీమియంతో ఎక్కువ బోనస్



సంబరాలు జరుపుకుంటున్న పోస్టల్ సిబ్బంది

గూడూరు: ప్రజలకు తక్కువ ప్రీమియంతో, ఎక్కువ బోనస్ అందజేసే తపాలాశాఖ ఆధ్వర్యంలో జీవిత బీమా పాలసీని అందరికీ చేరువ చేయడమే లక్ష్యమని ఎస్ఎస్‌వీపీకే కుమార్ అన్నారు. స్థానిక ప్రధాన తపాలా కార్యాలయంలో గురువారం తపాలా శాఖ పోస్టర్ లైఫ్ ప్రారంభించి 140 ఏళ్లు పూర్తయిన సందర్భంగా పీఎల్ఐ మేళా నిర్వహించారు. ఈ మేరకు గూడూరు డివిజన్ నుంచి బుధవారం ఒక్క రోజే రూ.4,87,50,000 ప్రీమియం వసూలు చేయడం జరిగిందని, ఈ మేరకు ఉద్యోగులతో కలసి కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నట్లు తెలిపారు. అలాగే పీఎల్ఐ స్కీం ద్వారా 19–55 ఏళ్ల లోపు వారు డిగ్రీ, డిప్లొమా, ఐటీఐ చదివి, ప్రభుత్వ లేదా, కార్పొరేట్ ఉద్యోగులు, వృత్తి విద్యానిపుణులు, ప్రైవేటు విద్యాసంస్థల ఉద్యోగులు గానీ ఈ పీఎస్ఐ పాలసీకి అర్హులన్నారు. దేశవ్యాప్తంగా అన్ని పోస్టాఫీసుల్లోనూ ఈ ప్రీమియం చెల్లించవచ్చన్నారు. వివరాలకు డెవలప్‌మెంట్ అధికారి సురేష్ కుమార్‌ను 9398427530 నంబరులో సంప్రదించవచ్చన్నారు. పోస్టుమాస్టర్ కరీముల్లా, గోవింద్‌నాయక్, హెచ్‌ఓ సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నాడు-నేడు పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ఎంఈఓ బాలకృష్ణారెడ్డి

కలువాయి: మనబడి నాడు–నేడు ఫేజ్ 2 పనులను వేగవంతం చేయాలని ఎంఈఓ బాలకృష్ణారెడ్డి అన్నారు. గురువారం ఆయన మండలంలోని కుల్లూరు, రామన్నగారిపల్లి ప్రాథమికోన్నత పాఠశాల, ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాలల్లో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్ఎంలు పనుల పురోగతికి సంబంధించి అంశాలవారీగా ఫొటోలు అప్‌లోడ్ చేయాలని, సిమెంట్ గడ్డ కట్టకుండా ఉండడానికి తగు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించి విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో సీఆర్పీ నాగేశ్వరరావు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ గిరి, హెచ్ఎంలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ఇబ్బంది లేకుండా చేస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రఘురెడ్డి

తడ: ప్రభుత్వం నిర్మిస్తున్న పక్కా గృహాలకు ఇసుక నేరుగా లబ్ధిదారులు నిర్మాణం చేసే చోటుకే చేరుతుందని, మిగిలిన అభివృద్ధి పనులకు అనుమతులు ఉంటే ఇసుక తరలింపునకు ఇబ్బంది లేకుండా చూస్తామని ఎంపీపీ కే.రఘురెడ్డి హామీ ఇచ్చారు. మండల సాధారణ సర్వసభ్య సమావేశం గురువారం తడ ఎంపీడీఓ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా పలువురు సర్పంచులు మాట్లాడుతూ మండలంలోని రామాపురం, పెరియవట్టు పంచాయతీలను విడగొడుతూ తమిళనాడుకు చెందిన అరంబాకం పోలీస్ స్టేషన్ ఉన్నందున ఆంధ్రా నుంచి ఈ రెండు పంచాయతీలకు తీసుకెళ్లే ఇసుకను అడ్డుకుంటున్నారని తెలిపారు. దీంతో పక్కా ఇళ్లు, రోడ్లు, ఇతర అభివృద్ధి పనులు ముందుకు సాగడం లేదన్నారు. దీనిపై ఎంపీపీ మాట్లాడుతూ సమస్య పరిష్కారానికి చొరవ చూపుతామని తెలిపారు. సమావేశంలో ఎంపీడీఓ మురళీకృష్ణ, తహసీల్దార్ రామయ్య, పీఆర్ డీఈ రమణయ్య, వైస్ ఎంపీపీలు వెంకటేష్, రమేష్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రతి కార్యకర్తకు అండగా ఉంటా



నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డితో డక్కిలి మండల వైఎస్సార్‌సీపీ నాయకులు



నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డిని గజమాలతో సత్కరిస్తున్న వెంకటగిరి నాయకులు

వెంకటగిరి: పార్టీ కోసం కష్టపడుతున్న ప్రతి కార్యకర్తకు అండగా ఉండడమే గాకుండా సముచిత స్థానం కల్పిస్తామని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. గురువారం నేదురుమల్లి నివాసంలో ఆయనను వెంకటగిరి నియోజకవర్గంలోని వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి, రాపూరు, సైదాపురం, కలువాయి మండలాల నుంచి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యంగా అందరం సమన్వయంతో పని చేయాలన్నారు. పార్టీలో లోటుపాట్లను సరి చేసి పార్టీ శ్రేణులను ఏకతాటిపై నడిపించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలియజేశారు. త్వరలో నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో గృహసారథులు, పార్టీ శ్రేణులతో విస్తృతస్థాయి సమావేశాలు నిర్వహిస్తామన్నారు. అలాగే మరింతమందిని పార్టీ పట్ల ఆకర్షితులను చేసేలా కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నేతలు చెలికం శంకర్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, పట్టణ కన్వీనర్ ఢిల్లీబాబు, సొసైటీ అధ్యక్షుడు దశరథరామిరెడ్డి, కార్తీక్‌రెడ్డి, రాజమోహన్‌నాయుడు, మాజీ ఎంపీపీ బ్రహ్మయ్య, జెడ్పీటీసీ అనిల్ కుమార్‌రెడ్డి, నాయకులు గణేష్‌రెడ్డి, కృష్ణయ్య, మునిరామిరెడ్డి, కౌన్సిలర్లు వహిదాయస్తానీ, శ్రీనివాసులురెడ్డి, కృష్ణమూర్తి,పాల్గొన్నారు.

రాజ్యాంగపరంగానే పదవి

నెల్లూరు(బారకాసు): ప్రభుత్వం తనకు రాజ్యాంగపరంగా రాష్ట్ర కమ్యూనిటీ డెవలప్‌మెంట్ బోర్డు చైర్మన్ పదవి ఇచ్చి కేబినేట్ హోదా కల్పించిందని నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి స్పష్టంచేశారు. గురువారం నెల్లూరులో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తనకిచ్చిన పదవి ఏదనే విషయం తెలుసుకోకుండా కొందరు మాట్లాడటం సరికాదన్నారు. వెంకటగిరితో తమ కుటుంబానికి 60 ఏళ్ల అనుబంధం ఉందని నేటికి అక్కడ తమ ఇల్లు ఉందని, తన ఓటు కూడా అక్కడే ఉందన్నారు. వెంకటగిరిలో నక్సల్స్ ప్రభావం ఉందని, నెల్లూరు ఒక మాఫియా అని, ప్రభుత్వానికి వ్యతిరేకంగా కొందరు మాట్లాడుతూ తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదన్నారు.

ప్రభుత్వ భూముల ఆక్రమణపై వినతి

ఓజిలి: కొంతమంది ప్రభుత్వ భూములను ఆక్రమించి సాగు చేస్తున్నారని పలు గ్రామాలకు చెందిన దళితులు తహసీల్దార్ లాజరస్‌కు గురువారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల పరిధిలోని రావిపాడు, ఇనుగుంట, వజ్జవారిపాళెం, పాళెంపాడు గ్రామాల రెవె న్యూ పరిధిలో 150 ఎకరాలు ప్రభుత్వ భూములు బాలాయపల్లి మండలం సరిహద్దుల్లో ఉన్నాయన్నారు. ఈ భూములను దళితులైన తమకు ఎలాంటి జీవనాధారం లేదని, కూలిపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని, అధికారులు స్పందించి భూపంపిణీలో తమలాంటి నిరుపేదలకు భూములు ఇప్పించాలని కోరారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేశారు. స్పందించిన తహసీల్దార్ వీఆర్వోను పంపి భూములను పరిశీలించి ప్రభుత్వ భూముల ఆక్రమణలను అడ్డుకుంటామని హామీ ఇచ్చారు.

ప్రభుత్వ భూములపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ కిరణ్‌కుమార్

గూడూరు: గూడూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని మండలాల్లో ప్రభుత్వ భూముల వివరాలతో పాటు, పలు విషయాలపై తహసీల్దార్లు, సర్వేయర్లతో గురువారం సాయంత్రం ఆర్డీఓ కిరణ్‌కుమార్ సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తుడా డెవలప్‌మెంట్ కమిటీ సమావేశంలో మండలాల వారీగా సీజేఎస్ఎస్ భూములు, ఇతర వివరాలను తెలియజేయాలని కోరడం జరిగిందన్నారు. ఈ మేరకు ఆ వివరాలతో పాటు, రీసర్వే పరిస్థితి తదితర విషయాలపై ఆయన వారితో సమీక్షించారు.

చదువుతోనే ఉన్నతస్థితి

కోట: విద్యార్థులు కష్టపడి చదువుకుని ప్రయోజకులు కావాలని గూడూరు ఆర్డీఓ కిరణ్‌కుమార్ సూచించారు. స్థానిక ఎస్సీ బాలికల వసతిగృహం విద్యార్థులకు ఆయన ఆర్డీఓ గురువారం దుస్తులు, విద్యాసామగ్రి అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు మీపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారని, కష్టపడి చదువుకుని ఉన్నతస్థితికి చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ పద్మావతి పాల్గొన్నారు.

ఓడూరుకు ప్రముఖుల సంతాపం



సుందరరామిరెడ్డి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

నాయుడుపేట: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఓడూరు గిరిధర్‌రెడ్డి తండ్రి ఓడూరు సుందరరామిరెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే. గురువారం నాయుడుపేట పట్టణంలోని గిరిధర్‌రెడ్డి నివాసంలో సుందరరామిరెడ్డి సంతాప సభ ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి, తిరుపతి ఎంపీ గురుమూర్తి, ప్రభుత్వ విప్ కొరుముట్ల శ్రీనివాసులు, శ్రీకాళహస్తి, గూడూరు ఎమ్మెల్యేలు బియ్యపు మధుసూదన్‌రెడ్డి, వరప్రసాద్, వెంకటగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి, ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు నరసింహారెడ్డి, నెలవల సుబ్రమణ్యం, మాజీ మంత్రి పరసా వెంకటరత్నం, ఎన్‌డీసీసీబీ చైర్మన్ సత్యనారాయణరెడ్డి, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మేరిగ మురళి, చెంగాలమ్మ ట్రస్ట్ బోర్డు చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడి, ఎంపీపీ ధనలక్ష్మి, సూళ్లూరుపేట మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్ రెడ్డి, వేనాటి రామచంద్రారెడ్డి, కట్టా సుధాకర్‌రెడ్డి తదితర నాయకులు సుందరరామిరెడ్డి చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి



క్రీడా మైదానాన్ని పరిశీలిస్తున్న జెడ్పీటీసీ రవీంద్రరాజు

ఓజిలి: ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పనకు కృషి చేస్తామని జెడ్పీటీసీ సభ్యుడు జి.రవీంద్రరాజు అన్నారు. మండల పరిధిలోని ఆర్మేనిపాడు ఉన్నత పాఠశాలలో జరుగుతున్న నాడు–నేడు పనులను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భట్లకనుపూరు గ్రామానికి చెందిన పారిశ్రామికవేత్త, గున్నంసేవాట్రస్ట్ నిర్వాహకుడు గున్నంరెడ్డి మధుసూదన్‌రెడ్డి పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామని చెప్పడం సంతోషకరమన్నారు. ఈ సందర్భంగా వారిని ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు రఘురామరాజు, హెచ్ఎం వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ సాయినాథ్

చిల్లకూరు: విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని గూడూరు మున్సిపల్ కమిషనర్ సాయినాథ్ హెచ్చరించారు. చిల్లకూరు–1, 2 సచివాలయాలను ఆయన గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన సచివాలయ సిబ్బందితో జనవరి నెలకు సంబంధించి వలంటీర్ల జీతాల విషయంలో సచివాలయ సిబ్బంది సకాలంలో స్పందించకపోవడంపై ఆరా తీశారు. వలంటీర్లలో కొంతమంది ఫిబ్రవరి ఒకటో తేదీన అందించే సామాజిక పింఛన్లు లబ్ధిదారులకు ఆలస్యంగా ఇచ్చారన్న విషయం కమిషనర్ దృష్టికి రావడంతో ఆయన సచివాలయాల సిబ్బందితో మాట్లాడారు. సంక్షేమ పథకాల పంపిణీలో ఎలాంటి పొరపాట్లు జరిగినా అంతా ఇంటికి వెళ్తారని హెచ్చరించారు.

ఆన్‌లైన్ లోన్ యాప్స్‌తో జాగ్రత్త

సైదాపురం: లోన్ యాప్‌లు చాలా ప్రమాదకరమని, ప్రజలు ఇన్‌స్టెంట్, ఆన్‌లైన్ లింకుల ద్వారా రుణాలను తీసుకోవద్దని ఎస్ఐ ఉమాశంకర్ కోరారు. మండలంలోని చీకవోలు గ్రామంలో గురువారం కోడిపందేలు, పేకాట, ఆన్‌లైన్ మోసాలపై ప్రజలకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆఫర్లు నమ్మి లోన్ తీసుకుంటే కాంటాక్ట్స్, గ్యాలరీ, తదితర వ్యక్తిగత సమాచారాన్ని యాప్ నిర్వాహకుడికి యాక్సెస్ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ఆపై వేధింపులు తప్పవన్నారు. అలాగే బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం కూడా నేరమన్నారు.